# స్వచ్ఛాంధ్ర దిశగా కీలక అడుగు

- బహిరంగ విసర్జన రహితంగా ఆంధ్రప్రదేశ్
- నిబంధనలు మీరితే భారీ జరిమానా
- ప్రకటించేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం
- రూ.209 కోట్లతో 1.39 లక్షల మరుగుదొడ్ల నిర్మాణం

ఈనాడు - అమరావతి

బహిరంగ మల మూత్ర విసర్జన రహితంగా రాష్ట్రాన్ని ప్రకటించే లక్ష్య సాధనలో ప్రభుత్వం మరో కీలక అడుగు వేయబోతోంది. రేపటి నుంచీ అన్ని నగర, పురపాలక సంఘాలను బహిరంగ మలమూత్ర విసర్జన రహితాలు(ఓడీఎఫ్)గా ప్రకటించనున్నారు. దీనికోసం క్షేత్రస్థాయిలో అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సంస్థను ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. దేశంలోనే మొట్టమొదటి ఓడీఎఫ్‌గా ఆంధ్రాను ప్రకటింపజేయాలని నిర్ణయించుకున్న ప్రభుత్వం ఈ దిశగా కార్యాచరణ రూపొందించుకుంది.

## జరిమానాలు, కఠిన చర్యలు

ఇప్పటికే పట్టణాలు, పంచాయతీలను దశల వారీగా ఓడీఎఫ్‌లుగా ప్రకటిస్తూ వస్తున్నారు. పట్టణాల్లో ఇకపై ఎవరు బహిరంగ విసర్జనకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటారు. ప్రాథమికంగా రూ.500 జరిమానా విధిస్తారు. ఇప్పటికే తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో ఈ తరహా జరిమానాలు అమలు చేస్తున్నారు. అయితే (మిగతా 2లో)

# స్వచ్ఛాంధ్ర దిశగా కీలక అడుగు

(మొదటి పేజీ తరువాయి)

ఈ జరిమానాలు, కఠిన చర్యలు ఎలా ఉండాలనే దానిపై ప్రభుత్వం త్వరలో ఒక ప్రకటన చేయనుంది. గుజరాత్ తరహాలో జరిమానాలుండాలని ప్రభుత్వం భావిస్తోంది.

**భారీగా మరుగుదొడ్ల నిర్మాణం..** పట్టణాలను ఓడీఎఫ్‌లుగా ప్రకటించాలనే క్రమంలో గత ఏడాదిగా ప్రభుత్వం భారీగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టింది. 112 పట్టణ స్థానిక సంస్థ(యూఎల్బీ)ల్లో 1,59,348 మరుగుదొడ్లు నిర్మించాలనేది లక్ష్యమైతే ఇప్పటికే 1,39,724 నిర్మించారు. ఇందుకోసం రూ.209.58 కోట్లు ఖర్చు చేశారు. ఒక్కో నిర్మాణ వ్యయం 15వేలు కాగా... ఇందులో కేంద్రం రూ.4వేలు చెల్లిస్తుంది. మొత్తం 3,451 వార్డుల్లో 3,375 వార్డులను ఓడీఎఫ్‌లుగా ప్రకటించారు. మరో 76 వార్డులను ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

**జియోట్యాగ్ పర్యవేక్షణలో..** మరుగుదొడ్ల నిర్మాణంలోనూ అధికారులు జియో ట్యాగ్ పద్ధతిని అనుసరించారు. మురికివాడల్లో 'మురికివాడ స్థాయి సమాఖ్య' సంఘాలను ఏర్పాటు చేసి, ఆ సభ్యులతో ఆయా ప్రాంతంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. వ్యక్తిగత మరుగుదొడ్డి లేని గృహాలను గుర్తించి వారు నిర్మించుకునేలా అవగాహన కల్పించారు. నిర్మాణ వ్యయాన్ని కూడా ఒకేసారి చెల్లించకుండా మూడు దశలలో చెల్లించే విధానాన్ని పాటించారు. నిర్మాణం ఏ దశలో ఉందో తెలుసుకోవడానికి ఫొటో సహా, జియో ట్యాగ్‌లు వేసి ప్రధాన కార్యాలయంనుంచి పర్యవేక్షించారు. మరుగుదొడ్డి నిర్మాణానికి స్థలం లేనివారు ఆ ప్రాంతంలోనే సామూహిక శౌచాలయాలను ఉపయోగించుకునేలా చేస్తున్నారు. దాంతో పాటు ఇంటింటికి చెత్తను సేకరించడంలోనూ వంద శాతం సాధించాలని యంత్రాంగం పాటుపడుతోంది. ఇప్పటికే 3,286 వార్డుల్లో వందశాతం సాధిస్తే, మరో 165 వార్డుల్లో దీన్ని అమలు చేయాల్సి ఉంది.